సాక్షి నల్లగొండ

మంగళవారం । 24 । జనవరి । 2023



వారసులే నిర్వహించాలి

జాన్‌పహాడ్ దర్గా ఉర్సును రెహమతుల్లా అలే వారసులే నిర్వహించుకోవాల్సిందిగా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. - 8లో



ఏప్రిల్ వరకు అంధుల పాఠశాల

నల్లగొండలోని అంధుల పాఠశాలను ఏప్రిల్ వరకు నడుపుతామని ఎంఈఓ తెలిపారు. - 8లో

గరిష్టం/కనిష్టం
31.°/16°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

డబుల్ రోడ్డు వేయాలని పాదయాత్ర



పాదయాత్రగా వస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండ టౌన్ : నల్లగొండ మండలం ముషంపల్లి గ్రామం నుంచి నల్లగొండ వరకు డబుల్ రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం గ్రామం నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రద్దీగా మారిన సింగిల్ రోడ్డు వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే సర్వే నిర్వహించి డబుల్ రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేశారు. వెలుగుపల్లి నుంచి రసుల్‌పురం మీదుగా దుప్పలపల్లి రైల్వే ట్రాక్‌వరకు బీటీరోడ్డు వేసేందుకు నిధులు కేటాయించాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాలడుగు నాగార్జున నలపరాజు సైదులు,హాషం, పాలడుగు ప్రభావతి, సత్తయ్య, కృష్ణారెడ్డి, జిల్లా అంజయ్య, సత్యనారాయణ, రవీందర్, బక్కయ్య, వెంకటయ్య, భారతమ్మ, సరోజా, అరుణకుమారి, ఉమారాణి, బాపురెడ్డి పాల్గొన్నారు.

జ్యుడీషియల్ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి

రామగిరి(నల్లగొండ) : జ్యుడీషియల్ ఉద్యోగుల సంఘం నూతన డైరీ, క్యాలెండర్‌ను జిల్లా జడ్జి బిఎస్.జగ్జీవన్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి తిరుపతి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మాతంగి వీరబాబు, లతీఫ్, వినోద్‌కుమార్, సరస్వతి, గిరి, తిరుమలేష్ తదితరులు ఉన్నారు.

ఎన్జీలో అకడమిక్ కౌన్సిల్ సమావేశం

రామగిరి(నల్లగొండ) : నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో సోమవారం అకడమిక్ కౌన్సిల్ సమావేశం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన అకడమిక్ అంశాలను చర్చించి తీర్మానాలు చేశారు. 2021–22 విద్యా సంవత్సరానికి సంబంధించిన పరీక్ష ఫలితాలను సమీక్షించి ఆమోదించారు. ఎంజీయూ నామినీ సభ్యులు ప్రొఫెసర్లు డాక్టర్ కె.అంజిరెడ్డి, అల్వాల రవి, డాక్టర్ రేఖ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేందర్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.శైలజ, నిధి పీపీసీ ఇండస్ట్రీస్ మేనేజింగ్ శ్రీధర్‌రెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ వెంపటి శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ అంతటి శ్రీనివాసులు, సయ్యద్ మునీర్, సీఓఈ బి.నాగరాజు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వైవీఆర్ ప్రసన్నకుమార్, యూజీజీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

నల్లగొండ : ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల్లో బాషాపండితులు, పీఈటీలకు కూడా అవకాశం కల్పించాలని కోరుతూ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తాకు వినతీపత్రం సమర్పించారు. పాఠశాలలో తెలుగు, హిందీ, ఉర్దూ బోధించే ఉపాధ్యాయులకు గతంలో ఎస్‌జీటీ హోదా ఉన్నదని.. సీఎం తెలుగు పండితులను స్కూల్ అసిస్టెంట్లుగా మారుస్తూ జీఓ 11, 12 విడుదల చేసిందని చెప్పారు. కానీ, ఎస్‌జీటీలు కొందరు కోర్టుకు వెళ్లారని.. దానివల్ల ప్రస్తుత పదోన్నతుల్లో అవకాశం లేకుండా పోయిందని. వెంటనే ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 11, 12లను అమలు చేసి బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు.

అలసత్వం వీడగా..

ఆదాయం మెండుగా

- నల్లగొండ మున్సిపాలిటీలో భారీగా పన్నుల రాబడి
- పకడ్బందీ చర్యలు చేపడుతున్న యంత్రాంగం
- పట్టణాభివృద్ధికి సొంత వనరులపై ప్రత్యేక దృష్టి
- ఆస్తి పన్ను, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ అన్నింటా పెరుగుదల
- అక్రమాలు, రాజకీయ ఒత్తిళ్లకు చెక్



సాక్షి, ప్రతినిధి, నల్లగొండ : నీలగిరి మున్సిపాలిటీలో అధికారులు, సిబ్బంది అలసత్వానికి, అక్రమాలకు చెక్ పడింది. సొంత వనరులను సమకూర్చుకోవడంలో నల్లగొండ మున్సిపాలిటీ పురోగతి సాధిస్తోంది. గతంలో కంటే గడిచిన ఏడాది కాలంలో ఆదాయం భారీగా పెరిగింది. ప్రజలకు అందించే సేవలతోపాటు పట్టణాభివృద్ధిలో కీలకమైన ఆదాయం పెంచుకునే మార్గాలను సుగమం చేసుకుంది. గతంలో రాజకీయ ఒత్తిళ్లు, కొంతమంది కౌన్సిలర్ల అలసత్వంతో మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి పెద్ద ఎత్తున గండిపడేది. గతేడాది నుంచి మాత్రం ఆ పరిస్థితి మారిపోయింది.

ఒత్తిళ్లకు లొంగకుండా..

నల్లగొండ పట్టణ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేకంగా పంపించిన మున్సిపల్ కమిషనర్ రమణాచారి ప్రత్యేక చొరవతో మున్సిపాలిటీ ఆదాయానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. ప్రజలకు సదుపాయాల కల్పన, సమస్యల పరిష్కారం కోసం అవసరమైన సొంత వనరులను సమకూర్చుకోవడంలో సక్సెస్ సాధించారు. మున్సిపల్ అధికారుల్లో ధైర్యం నింపి, రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా తలొగ్గకుండా చర్యలు చేపట్టారు. అలసత్వం, అక్రమాలతో ఆగిపోయిన మున్సిపాలిటీ ఆదాయాన్ని రాబట్టుకునేలా పక్కా చర్యలు చేపట్టంతో గతంలో కంటే పెద్ద ఎత్తున ఆదాయం పెరిగింది. అన్నింటికి మించి పాత బకాయిలను వసూలు చేయించడం, అందుబాటులో లేకపోతే ఫోన్ చేసి మరీ వసూలు చేయడం వంటి చర్యలతో నీలగిరి మున్సిపాలిటీ స్వయం సమృద్ధి దిశగా ముందుకు వెళ్తోంది.

గతంలో అడుగడుగునా అడ్డంకులే..

పట్టణంలో ఇళ్ల అసెస్‌మెంట్ సరిగ్గా చేయకపోవడం, భవనం కట్టిన తర్వాత ఐదారేళ్ల వరకు పన్నుఉ వసూలు చేయకుండా పెండింగ్‌లో పెట్టడం వంటి చర్యలకు మున్సిపాలిటీ ఫుల్‌స్టాఫ్ పెట్టింది. ఎక్కువ ఆస్తి పన్ను బకాయి ఉన్న వారి నుంచి వసూళ్లలో రాజకీయ ఒత్తిళ్లతో వెనక్కి తగ్గడం వంటి చర్యలను వదిలేసి పక్కాగా పన్నుల వసూళ్లకు దిగింది. నీటి పన్ను విషయంలోనూ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోకపోయినా కొందరు కౌన్సిలర్లే నీటి కనెక్షన్లు పెట్టించడం, పన్ను వసూళ్లలో అడ్డుపడటం వంటి చర్యలకు బ్రేక్ వేసింది.

పన్నుల వసూలు ఇలా (రూ. లక్షల్లో)..

కేటగిరీ	2019–20	2020–21	2021–22	2022–23 (డిసెంబర్ వరకు)
ఆస్తి పన్ను	377.30	1488.30	1143.28	1745.64
నీటి పన్ను	78.57	65.06	139.84	247.51
ట్రేడ్ లైసెన్స్	7.06	15.21	43.26	64.11
షాపు అద్దెలు	38.14	4.32	34.86	125.82
ప్రకటనల పన్ను	0.65	22.80	11.54	16.10

9 నెలల్లోనే భారీగా..

పట్టణంలో పన్నుల రూపంలో వచ్చే ఆదాయం భారీగా పెరిగింది. 2021–21 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 2022–23 ఆర్థిక సంవత్సరంలో కేవలం 9 నెలల్లోనే మున్సిపాలిటీ భారీగా వృద్ధి సాధించింది. ఆస్తి పన్ను రూ.6.02 కోట్లు అదనంగా వసూలు చేయగలిగింది. నీటి పన్ను విషయంలోనూ రూ.1.07 కోట్లు అదనంగా వసూలైంది. ట్రేడ్ లైసెన్స్ కింద రూ.20.85 లక్షలు, షాపుల అద్దె విషయంలో రూ.90.96 లక్షలు, ప్రకటనల ద్వారా రూ. 4.56 లక్షలు అదనంగా రాబట్టుకోగలిగింది.

ట్రేడ్ లైసెన్స్ విషయంలోనూ మున్సిపల్ కార్యాలయం వారే పట్టించుకోకవపోవడం, సిబ్బంది సరిపడా లేకపోవడం వంటి సమస్యలతో తక్కువగా వసూలయ్యేది. మున్సిపాలిటీకి చెందిన షాపుల అద్దెల వసూళ్లలోనూ అదే పరిస్థితి ఉండగా దానిలోనూ మార్పు వచ్చింది. గతంలో షాపుల అద్దె సరిగ్గా వసూలు చేయకపోవడం, అద్దె చెల్లించని షాపులను సీజ్ చేసినా రాజకీయ ఒత్తిళ్లతో ఓపెన్ చేయించడం, పన్ను వసూళ్లకు అడ్డుపడటం వంటి వాటికి స్థానం లేకుండా చర్యలు చేపట్టారు. ప్రకటనల విషయంలోనూ ఒత్తిళ్లను అధిగమించడంతో ఆదాయం పెరిగింది.

ఎరువుతోనూ అదనపు ఆదాయం



పన్నులు పక్కాగా వసూలు చేస్తేనే పట్టణాభివృద్ధికి ఉపయోగం. తద్వారా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టవచ్చు. పన్నుల రూపంలోనే కాకుండా ఇతర ఆదాయ మార్గాలపైనా ప్రత్యేక దృష్టి పెట్టాం. ఇంటింటి ద్వారా సేకరించిన చెత్తను ఒకచోటకు చేర్చి రిసోర్స్ పార్క్‌గా డెవలప్ చేశాం. అక్కడ ఎరువు తయారు చేయిస్తున్నాం. రూ.65 ఒక బ్యాగ్ చొప్పున విక్రయిస్తున్నాం. హరితహారానికి ఇదే ఎరువు వినియోగిస్తున్నాం. అదనపు ఆదాయం వస్తోంది.

– రమణాచారి, మున్సిపల్ కమిషనర్

బీఆర్‌ఎస్ వైపు దేశం చూపు

- కాంగ్రెస్, బీజేపీ తోడు దొంగల పార్టీలు
- మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- నిడమనూరు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం



మార్కెట్ చైర్మన్ మర్ల చంద్రారెడ్డిని అభినందిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

నిడమనూరు : ప్రస్తుతం దేశం మొత్తం భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) వైపు చూస్తోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణను అభివృద్ధి చేసిన విధంగానే దేశ రైతాంగానికి మేలు చేయాలని సీఎం కేసీఆర్ దృఢ నిశ్చయంతో ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని.. రుణమాఫీ, రైతుబంధుతో రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ తోడు దొంగల పార్టీలని, వాటికి దేశ అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధి మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయడమే బీఆర్‌ఎస్ పార్టీ లక్ష్యమన్నారు. అంతకుముందు ప్రధాన రహదారిపై ఎడ్లబండి మీద మంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఊరేగింపుగా వచ్చారు. మార్కెట్ చైర్మన్‌గా మర్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్‌గా మెరుగు రామలింగయ్యలతో పాటు డైరెక్టర్లతో వ్యవసాయ శాఖ అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మండల కేంద్రంలో రూ.35 లక్షలతో పునర్నిర్మించిన పీఏసీఎస్ కార్యాలయం, గోదాములను డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో కలిసి మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు నోముల భగత్, ఎన్.భాస్కర్‌రావు, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ట్రైకార్ చైర్మన్ రామచంద్రనాయక్, ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, డీసీసీబీ డైరెక్టర్ విరిగినేని అంజయ్య, ఎంపీపీ బొల్ల జయమ్మ, కేవీ రామారావు, మన్నెం రంజిత్‌యాదవ్, వెంకటరెడ్డి, తాటి సత్యపాల్, శ్రీని వాసరెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

వ్యాపారంపై దృష్టి సారించాలి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

త్రిపురారం : ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ పీఏసీఎస్‌లు వ్యాపారాల అభివృద్ధిపై దృష్టి సారించాలని మంత్రి జగదీశ్‌రెడ్డి సూచించారు. త్రిపురారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ ధనావత్ జయరాం నాయక్‌కు శాలువా కప్పి కుర్చీలో కూర్చోబెట్టారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు నోముల భగత్, భాస్కర్‌రావు, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, ఎంపీపీ అనుముల పాండమ్మ, జెడ్పీటీసీ ధనావత్ భారతి, సర్పంచ్ అనుమల శ్రీనివాసరెడ్డి, బహునూతుల నరేందర్, కామర్ల జానయ్య, మాద ధనలక్ష్మి, పెద్దబోయిన శ్రీనివాస్, వెంకటాచారి, రామచంద్రయ్య, కలకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● నేతాజీ బాటలో..



నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా నల్లగొండలోని చిన వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

సారూ.. మొర ఆలకించరూ!

- ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ
- బాధితుల నుంచి వినతులు స్వీకరించిన అదనపు కలెక్టర్



నల్లగొండ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన బాధితుల నుంచి అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు వినతులను స్వీకరించారు. ఈ వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కూతురు పట్టించుకోవడం లేదని..

నల్లగొండ పట్టణంలోని గాంధీనగర్‌కు చెంది రొండి అంజయ్య, లింగమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వారిలో ఒక కుమారుడు చనిపోగా మరో కుమారుడు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పెద్ద కూతురు హైదరాబాద్‌లో ఉంటోంది. చిన్న కూతురిని ఎంఏ వరకు చదివించారు. ప్రస్తుతం ఆమె శాలిగౌరారం మండలం గురిజాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. కానీ, తల్లిదండ్రుల బాగోగులు మాత్రం పెద్ద కూతురే చూసుకుంటోంది. చిన్నకూతురు తమను పట్టించుకోవడం లేదని ఆ దంపతులు అప్పట్లో ఆర్డీఓకు ఫిర్యాదు చేయగా వయోవృద్ధుల సంక్షేమ చట్టం కింద విచారించి చిన్న కూతురు వెంకటరమణ తల్లిదండ్రులకు గతేడాది నవంబర్ నుంచి ప్రతినెల రూ.10 వేలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. అది ఆమలుకు నోచుకోకపోవడంతో ఆ దంపతులు సోమవారం గ్రీవెన్స్ డేలో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన అదనపు కలెక్టర్ హెడ్‌మాస్టర్‌కు ఫోన్ చేసి మూడు నెలలకు సంబంధించి రూ.30 వేలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని.. ఆర్డీఓ కోర్టు ఆదేశాలను అమలు చేయాలని ఆదేశించారు.

బాటను ఆక్రమించారని..



నిడమనూరు మండలం ఎర్రబెల్లిలో ప్రభుత్వ నక్ష బాటను ఆక్రమించి పొలాలకు వెళ్లకుండా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి వెంకట్‌రెడ్డి, వెంకన్న, యాదగిరిరెడ్డి, అంజిరెడ్డి, మోహన్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. 70 సంవత్సరాల నుంచి ధర్మాపురం రోడ్డు వరకు ఉన్న నక్ష బాటను ఆక్రమించి బత్తాయి మొక్కలు నాటి మా పొలాలకు వెళ్లేందుకు దారి లేకుండా చేశారని వివరించారు. వెంటనే సర్వే చేయించి న్యాయం చేయాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



పశు సంవర్ధక శాఖలో ఎనిమిదేళ్లుగా సేవా దృక్పథంతో పని చేస్తున్నామని మాకు ఉద్యోగ భద్రత కల్పించి.. వేతనాలు ఇవ్వాలని పశుమిత్రలు వినతిపత్రం అందజేశారు. రోజూ జంతువుల ఆరోగ్య సమస్యలపై ఆవులు, బర్రెలు, మేకలు, కోళ్లు, కుక్కలుకు సంబంధించి కృత్రిమ గర్భదారణ, వ్యాక్సిన్, టీకాలు వేయడం, నట్టల మందులు వేయడం, శాస్త్రచికిత్సలు, వ్యాధి నిరోదక టీకాలు వేసే కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని చెప్పారు. వెట్టి చాకిరి చేస్తున్న మమ్ములను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

వేతనాలు ఇప్పించాలి



వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పని చేస్తున్న 3వ ఎంపీ హెచ్ఏ (ఫిమేల్)లకు వేతనాలు ఇప్పించాలని కోరుతూ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నిధులు విడుదల చేసి వేతనాలు ఇప్పించాలని కోరారు.

భూసమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి


మిర్యాలగూడ : భూ సమస్యలకు పరిష్కారానికి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశించారు. సోమవారం మాడ్గులపల్లి మండలంలోని ఇందుగుల గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, ఇంతవరకు భూమి పట్టాకాని రైతులు అన్ని ఆధారాలతో ధరణిలో పొందుపరుచురేని తమ సమస్య నుంచి విముక్తి పొందాలని సూచించారు. ధరణి ద్వారా రైతులకు మేలు జరుగుతుందని, సమస్యలు ఉన్నట్లయితే నేరుగా అధికారులను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్ర కన్నయ్య, టీడీ శివశంకర్, ఆర్ఐ అక్తర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం తనిఖీ..

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సోమవారం తనిఖీ చేశారు. శిబిరంలో ఎంత మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంటి పరీక్షలకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట నల్లగొండ ఆర్డీఓ జయచంద్రారెడ్డి, ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, డాక్టర్ ప్రదీప్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

27నుంచి ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ

- షెడ్యూల్ విడుదల చేసిన విద్యాశాఖ
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు



నల్లగొండ : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన షెడ్యూల్‌ను విద్యాశాఖ సోమవారం విడుదల చేసింది. ఈనెల 27 నుంచి బదిలీల ప్రక్రియ ప్రారంభం కానుంది. మార్చి 4న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి కానుంది. జిల్లాలో మొత్తం 2774 ఖాళీలు ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ ఇప్పటికే ప్రకటించింది. అందులో 2,165 మందికి బదిలీలు అయ్యే అవకాశం ఉంది. 510మంది పదోన్నతుల ద్వారా బదిలీ కానున్నారు.

మార్చి 4 నాటికి ప్రక్రియ పూర్తి

ఈనెల 27న ఉపాధ్యాయుల ఖాళీల జాబితాను కేటగిరీల వారీగా ప్రకటించనున్నారు. 28 నుంచి 30వ తేదీ వరకు బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఆయా కేటగిరీల ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతులకు సంబంధించి డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 3 నుంచి 6వ తేదీ వరకు హార్డ్‌కాపీల పరిశీలన చేపట్టనున్నారు. 7వ తేదీన డీఈఓ ఆఫీస్‌లో సీనియారిటీ ప్రకారం బదిలీలు, పదోన్నతుల జాబితా ప్రకటించనున్నారు. అభ్యంతరాలు ఉంటే డీఈఓ ద్వారా ఆర్‌జేడీకి ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. ఫిబ్రవరి 11న పదోన్నతులు, బదిలీల సీనియారిటీ జాబితాను జిల్లా విద్యాశాఖ అధికారి వెబ్‌సైట్‌లో ప్రకటించనున్నారు. ఆ తర్వాత మార్చి 4వ తేదీలోగా పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేయనున్నారు. 5వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఉపాధ్యాయుల నుంచి వచ్చే అభ్యంతరాలు స్వీకరించి 15 రోజుల్లో వాటిని పరిష్కరించనున్నారు.

సంపూర్ణ సహకారం అందిస్తాం



ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు ప్రక్రియ సజావుగా జరిగేందుకు మా సంఘం ముందుంటుంది. ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు మా సంఘం కార్యాలయంలో 20 కంప్యూటర్లు అందుబాటులో ఉంచాం.

– సుంకరి భిక్షంగౌడ్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు

అందరికీ న్యాయం జరిగేలా చూడాలి



ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల విషయంలో ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేయడం ఎంతో ఆనందంగా ఉంది. చాలా కాలం తర్వాత ఈ ప్రక్రియ జరుగుతున్నందున చాలా మందికి మేలు జరగనుంది. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రక్రియను సజావుగా జరిపి అందరికి న్యాయం జరిగేలా చూడాలి.

భీమయ్య, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

షెడ్యూల్‌ను స్వాగతిస్తున్నాం



ఎనిమిదేళ్ల తర్వాత ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు షెడ్యూల్ విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నాం. దీనివల్ల ఉన్నత పాఠశాలలో ఉన్న విద్యార్థులకు మేలు కలుగుతుంది. పదోన్నతుల ద్వారా సబ్జెక్టు టీచర్ల కొరత తీరనుంది. పండిట్‌లు, పీఈటీల సమస్యలు కూడా పరిష్కరిస్తే పూర్తిస్థాయిలో పరిపూర్ణం అవుతుంది.

– పెరుమళ్ల వెంకటేశం, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

పండిట్‌లు, పీఈటీలకు న్యాయం చేయాలి



బాషా పండిట్‌లు, పీఈటీలకు అప్‌గ్రేడ్ చేసిన పోస్టుల్లో అవకాశం కల్పించాలి. ప్రస్తుత విధానం వల్ల పండిట్‌లకు అన్యాయం జరగనుంది. వారికి న్యాయం జరిగేలా షెడ్యూల్ ఇస్తే డీటీఎఫ్ స్వాగతిస్తుంది. అదేవిధంగా పీఎస్ హెడ్‌మాస్టర్ల బదిలీలు 8 సంవత్సరాల పొడిగింపును రద్దు చేసి 5 సంవత్సరాలకు కుదించాలి.

– పి.వెంకులు, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

పారదర్శకంగా కంటి వెలుగు నిర్వహించాలి



పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ కొండల్‌రావు

త్రిపురారం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది సమన్వయంతో పారదర్శకంగా నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కొండల్‌రావు సూచించారు. సోమవారం త్రిపురారం, రాగడప గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా త్రిపురారం సెంటర్‌లో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ కేసా రవి, త్రిపురారం మండల వైద్యాధికారి శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యవసాయ మోటారు చోరీ



చోరీ జరిగిన మోటారు పైపును పరిశీలిస్తున్న రైతులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని రామలక్ష్మీపురం శివారులో గల కాల్వలు, బావుల వద్ద వ్యవసాయ మోటార్లను దుండగులు చోరీ చేస్తూ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఇప్పటికే గ్రామ పరిధిలోని నలుగురు రైతుల మోటార్లను చోరీ చేసిన దుండగులు, ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన బెల్లంకొండ వెంకటేశ్వర్లు గణపవరం మేజర్ కాల్వపై ఏర్పాటు చేసిన మోటారులోని విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లారు. వ్యవసాయ మోటార్ల చోరీకి పాల్పడుతున్న నిందితులను పోలీసులు గుర్తించి రైతులు ఇబ్బందులు లేకుండా చూడాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అన్నెం పాపిరెడ్డి కోరారు.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి



శ్రీనాథ్ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఇంజన్ టైరు కింద పడి డ్రైవర్ మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి మండలంలోని పెద్దరావులపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి మండలంలోని కప్రాయిపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మన్నె శ్రీనాథ్(21) ఆదివారం రాత్రి పెద్దరావులపల్లిలో పొలం పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో పెద్దరావులపల్లి గ్రామశివారులోకి రాగానే ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రాయిని ఢీకొట్టడంతో శ్రీనాథ్ ఎగిరి ట్రాక్టర్ ఇంజన్ టైరు కింద పడిపోయాడు. ఈ క్రమంలో టైరు అతడి తలపైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకొన్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి కిష్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సోమవారం ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపారు. కిష్టయ్యకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వీరిలో శ్రీనాథ్ చిన్న కుమారుడు. చేతికి అందివచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడటంతో ఆ కుటుంబంలో పెనువిషాదం నెలకొంది.

జాన్‌పహాడ్ ఉర్సును వారసులే నిర్వహించాలి

● తీర్పు వెలువరించిన హైకోర్టు



హైకోర్టు తీర్పు కాపీలను చూపుతున్న ఉర్సు చీఫ్ కోఆర్డినేటర్ అబ్దుల్ లతీఫ్, హక్కుదారులు

సూర్యాపేట: పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్‌లో గల హజ్రత్ జాన్ పాక్ షహీద్ (రెహమతుల్లా అలే) దర్గా ఉర్సును రెహమతుల్లా అలే వారసులే నిర్వహించుకోవాల్సిందిగా హైకోర్టు తీర్పు వెలువరించినట్లు ఉర్సు చీఫ్ కోఆర్డినేటర్ మహమ్మద్ అబ్దుల్ లతీఫ్, హక్కుదారు మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. కొంతకాలంగా జాన్‌పహాడ్‌కు చెందిన మోహినుద్దీన్ కుటుంబ సభ్యుడు సయ్యద్ జానీ దర్గా వద్ద ముజావర్‌గా కొనసాగుతూ అధికారులు, వక్ఫ్ బోర్డును తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. మోహినుద్దీన్ కుటుంబ సభ్యులు ముజావర్‌గా కొనసాగడంపై తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన డబ్ల్యూపీ నంబర్ 27712/2014, 24198/2015 పిటిషన్లను విచారించిన హైకోర్టు మోహినుద్దీన్ కుటుంబ సభ్యులకు దర్గాకు సంబంధించి ఎలాంటి హక్కులు లేవని తీర్పునిచ్చినట్లు పేర్కొన్నారు. పాలకవీడుకు చెందిన రెహమతుల్లా అలే వారసులు మహమ్మద్ అహ్మద్ హుస్సేన్, మహమ్మద్ ఇమాముద్దీన్, మహమ్మద్ గులాం రసూల్, మహమ్మద్ హనాన్, మహమ్మద్ హుస్సేన్, మహమ్మద్ సలార్, మహమ్మద్ గౌస్ దర్గా హక్కుదారులని హైకోర్టు తెలిపిందన్నారు. అనంతరం దర్గా హక్కుదారుడు మహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహించే దర్గా ఉర్సుకు రావాల్సిందిగా మంత్రి జగదీశ్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, నల్లమోతు భాస్కరరావు, బొల్లం మల్లయ్యయాదవ్, సూర్యాపేట కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్‌ను ఆహ్వానించినట్లు తెలిపారు. సమావేశంలో హక్కుదారులు గులామ్ రసూల్, మహమ్మద్ హనాన్, మహమ్మద్ సాలార్ ఖాద్రీ, మహమ్మద్ గౌస్ బాబు, మాజీద్, రియాజ్ పాల్గొన్నారు.

రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని వృద్ధుడు మృతి



లింగయ్య మృతదేహం

కేతేపల్లి: గుర్తుతెలియని కారు ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన మండలంలోని చీకటిగూడెం గ్రామ శివారులో జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామానికి చెందిన కుమ్మరి లింగయ్య(65) చీకటిగూడెం గ్రామ శివారులో జాతీయ రహదారి వెంట ఉన్న లిటిల్ విలేజ్ హోటల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. రోజుమాదిరిగా సోమవారం లింగయ్య హోటల్‌లో విధులకు హాజరయ్యేందుకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో హైవే దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న గుర్తుతెలియని కారు అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన లింగయ్యను చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ ఆగకుండా పరారయ్యాడు. మృతుడి కుమారుడు జానయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

మార్కండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఊరేగింపులో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, తదితరులు



ఉరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కేరళ వాయిద్య బృందం

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని శ్రీమార్కండేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామివారిని గుర్రపు బగ్గిపై ప్రతిష్ఠించి కేరళ నాదస్వర, మృదంగ బృందం, మహిళల కోలాటాల నడుమ పురవీధుల గుండా నూలు దండల ఊరేగింపు నిర్వహించి స్వామివారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ బడుగు చండీకేశ్వర్, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, చేనేత సంఘం రాష్ట్ర నాయకులు తడక వెంకటేశం, తడక రమేశ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యనారాయణ, మహాజన సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కర్నాటి పాండు, అంకం మురళి, కౌన్సిలర్లు గుండు మధు, భోగ భానుమతివిష్ణు, రుద్ర శ్రీశైలం, సూరెపల్లి రమేశ్, భోగ స్వామి, ధర్మకర్తల మండలి ఉపాధ్యక్షుడు భోగ చంద్రశేఖర్, కార్యదర్శి రుద్ర బాలరాజు, కోశాధికారి రాజారమేశ్, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకంపై పేరు పెట్టలేదని కూల్చివేత

● బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కేసు నమోదు

నల్లగొండ క్రైం: తమ ఊరి పేరు, ఉప సర్పంచ్ శిలాఫకంలో పెట్టలేదని దానిని కూల్చివేసిన ఏడుగురిపై నల్లగొండ రూరల్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. నల్లగొండ మండలంలోని రెడ్డికాలనీ గ్రామపంచాయతీ పరిధిలోని బట్టపోతులగూడెం వెళ్లే దారిలో సీసీ రోడ్డు వేసేందుకు ఆదివారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అయితే శిలాఫలకంపై గ్రామ ఉప సర్పంచ్ దార శంకర్ పేరు, బట్టపోతులగూడెం పేరు పెట్టలేదని గ్రామస్తులు ఆరోపించారు. తాను దళితుడిని కావడంతోనే తన పేరు శిలాఫలకంపై పెట్టలేదని, ఇదే విషయాన్ని సర్పంచ్‌కు చెప్పినా పట్టించుకోలేదని ఉప సర్పంచ్ దార శంకర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అయితే కార్యక్రమం ముగించుకుని ఎమ్మెల్యే వెళ్లిపోయిన తర్వాత పలువురు ఆ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. దీంతో సోమవారం గ్రామ కార్యదర్శి బొర్ర సుజాత నల్లగొండ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా దార శంకర్, దార పాండు, దార శివ, దార మహేష్, దార భిక్షమయ్య, రేఖల అంజనేయులు, సుంకరబోయిన శివకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ రూరల్ ఎస్‌ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు. అయితే బట్టపోతులగూడెం గ్రామ దళితులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తామంతా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారిమని, సర్పంచ్ గెలుపు కోసం కీలకంగా పనిచేశామని, శిలాఫలకంలో తమ పేరు లేదని ప్రశ్నించినందుకు కేసులు పెట్టి ఇబ్బంది పెట్టొద్దని వాపోయారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



రెహమాన్ బాబాకు సెల్‌ఫోన్ అందజేస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీను

నల్లగొండ క్రైం: పట్టణానికి చెందిన ఎండీ రెహమాన్ బాబా పానగల్లు బైపాస్ వద్ద సోమవారం సాయంత్రం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. సాక్షి యూనిట్ కార్యాలయంలో పనిచేస్తున్న గౌరు మల్లేష్‌కు ఆ సెల్‌ఫోన్ దొరకడంతో ట్రాఫిక్ పోలీసులకు అప్పగించాడు. సెల్‌ఫోన్‌లో ఉన్న విజిటింగ్ కార్డు ఆధారంగా రెహమాన్ బాబాను గుర్తించి ట్రాఫిక్ సీఐ శ్రీను అతడికి సెల్‌ఫోన్ అందజేశారు.

సోమయాజుల లక్ష్మీనరసింహశాస్త్రికి సతీవియోగం



వరలక్ష్మీదేవి (ఫైల్)

మఠంపల్లి: మఠంపల్లికి చెందిన బ్రహ్మశ్రీ సోమయాజుల లక్ష్మీనరసింహశాస్త్రి సతీమణి వరలక్ష్మీదేవి (78) సోమవారం తన స్వగృహంలో కన్నుమూశారు. లక్ష్మీనరసింహశాస్త్రి ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో భక్త రామదాసు పుట్టిన ఇంట్లో జన్మించారు. సుమారు ఆరు దశాబ్దాల క్రితం ఆయన మఠంపల్లికి వచ్చి వీవీ హైస్కూల్‌లో తెలుగు పండిట్‌గా ఉద్యోగం చేస్తూ ఇక్కడే స్థిరపడ్డారు. లక్ష్మీనరసింహశాస్త్రి భద్రాచలం, మట్టపల్లి దేవాలయాల్లో నిర్వహించే కల్యాణాలకు ఆలిండియా రేడియో, దూరదర్శన్‌లలో ప్రత్యక్ష వ్యాఖ్యాతగా వ్యవహరించి కీర్తి గడించారు. వరలక్ష్మీదేవి కూడా శ్రీకనకదుర్గ దేవాలయంలో పురోహితురాలిగా తన కుమారుడు, భర్తతో కలిసి పనిచేస్తున్నారు. వరలక్ష్మీదేవి మృతి పట్ల ఎంపీపీ పార్వతీకొండానాయక్, సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సైదమ్మ, ఉప సర్పంచ్ జాల కిరణ్, గ్రంథాలయ చైర్మన్ బీవీ రామారావు, మన్నెం శేషిరెడ్డి, గాయం రామచంద్రారెడ్డి, భోనగిరి ప్రకాష్‌బాబు, కండె వెంకన్న, సురేష్‌గౌడ్, రవీందర్ తదితరులు నివాళులర్పించారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

పెద్దఅడిశర్లపల్లి: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని పోల్కంపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గుడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారెడ్డిపల్లికి చెందిన కాటేపాక సైదులు(33) బతుకుదెరువు నిమిత్తం పోల్కంపల్లి గ్రామానికి వలస వచ్చి ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం పోల్కంపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సైదులు చనిపోయాడని అతడి అన్న వెంకటయ్యకు ఫోన్‌లో సమాచారం అందించాడు. దీంతో వెంకటయ్య తన బంధువులతో కలిసి పోల్కంపల్లికి వచ్చి సైదులు మృతదేహాన్ని పరిశీలించగా చెవుల కింద, మెడపై గాయాలు కనిపించాయి. తన సోదరుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని వెంకటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గుడిపల్లి ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

మృతదేహంపై పచ్చబొట్లు గుర్తింపు

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామ వారులోని ఓ వెంచర్‌లో ఆదివారం లభ్యమైన సగం కాలిన వ్యక్తి మృతదేహానికి సోమవారం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి ఎడమ చేతిపై కావ్య అని, కుడి చేతిపై వృత్తాకారం మధ్యలో అమ్మ అని, కుడి భుజంపై సూర్యుని ఆకారంలో ఓం అనే పచ్చబొట్లు ఉన్నట్లు గుర్తించినట్లు నార్కట్‌పల్లి పోలీసులు తెలిపారు. ఈ గుర్తులు కలిగిన వ్యక్తి వివరాలు తెలిసిన వారు 9440795635, 9440795610 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆధునిక సమాజానికి మ్యాథమెటిక్స్ కీలకం

● ఎంజీయూ రిజిస్ట్రార్ కృష్ణారావు



సెమినార్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణారావు తదితరులు

ఎంజీయూ(నల్లగొండ రూరల్): ఆధునిక సమాజానికి మ్యాథమెటిక్స్ కీలకంగా మారిందని మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కృష్ణారావు అన్నారు. ఈ నెల 28న యూనివర్సిటీలో 'రీసెంట్ టెక్నిక్స్ ఇన్ మ్యాథమెటికల్ అప్లికేషన్స్' అనే అంశంపై నిర్వహించనున్న సెమినార్‌కు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధి కల్పనలో గణితం పాత్ర కీలకమన్నారు. శ్రీనివాస రామానుజన్ జన్మదినం సందర్భంగా నిర్వహించే వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో హైమావతి, ఉపేందర్‌రెడ్డి, మద్దిలేటి రవి, అంజిరెడ్డి, ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'పెద్దగట్టు' దిష్టిపూజ



దేవర పెట్టె వద్ద పూజలు నిర్వహిస్తున్న యాదవులు



స్వామివారి దర్శనానికి వస్తున్న భక్తులు

చివ్వెంల(సూర్యాపేట): తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్దదైన శ్రీలింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర దిష్టిపూజ మహోత్సవం సోమవారం ముగిసింది. ఆదివారం అర్ధరాత్రి తర్వాత గట్టుకు చేరుకున్న దేవర పెట్టెలోని దేవతావిగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మెంతబోయిన, మున్న వంశస్తులు తమ వెంట తీసుకొచ్చిన తల్లి, పిల్ల గొర్రె పిల్లను బలిచ్చి బలిహరణ నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున తల్లి పిల్ల మాంసంతో వండిన వంటను భక్తులకు వండించారు. అనంతరం దేవర పెట్టె ముందు పసుపుతో వేసిన ముగ్గును మున్న, మెంతబోయిన వంశస్తులు గొర్లవారితో కలిసి ఒక్కరాశిగా చేర్చి దానిని ఆలయం ముందుభాగంలో ఉన్న పుట్టలో పోశారు. ఈ సందర్భంగా భక్తులు భారీగా తరలి వచ్చి పూజలు నిర్వహించారు. దేవర పెట్టెను సాయంత్రం యాదవులు భుజాలపై ఎత్తుకుని తిరిగి కేసారం గ్రామ తరలించి అక్కడ మెంతబోయిన వారి ఇంట్లో ఉంచారు. 15 రోజుల పాటు అక్కడే ఉంచి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహించి తిరిగి పౌర్ణమి రోజు పెద్దగట్టుకు తీసుకొస్తారు. ఈ కార్యక్రమంలో పెద్దగట్టు దేవస్థాన కమిటీ చైర్మన్ కోడి సైదులు యాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, తండు శ్రీనివాస్ యాదవ్, మద్ది శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

నల్లగొండ క్రైం: మూగ వ్యక్తుల్లా నటిస్తూ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను నల్లగొండ టూటౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన యేసు అలియాస్ దర్విడ్ నల్లగొండ పట్టణంలో నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. యేసుతో పాటు పట్టణంలోని కామేశ్వర్‌రావు కాలనీకి చెందిన చింత యాదగిరి మూగవారిగా నటిస్తూ ఏదైనా సాయం చేయమని ఇంటింటికి తిరుగుతుండేవారు. ఇంటి యజమానులు ఏదైనా సాయం చేద్దామని ఇంట్లోకి వెళ్లగానే వీరు సెల్‌ఫోన్‌లు, నగదు, విలువైన వస్తువులు చోరీ చేసి పరారయ్యేవారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలో నివాసముంటున్న చింత సుధీర్ ఇంటికి వెళ్లిన దొంగలిద్దరూ రెండు సెల్‌ఫోన్‌లు చోరీ చేశారు. చోరీ చేసిన సెల్‌ఫోన్‌లను సోమవారం రామగిరిలో అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా అప్పటికే అందిన సమాచారం మేరకు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏప్రిల్ వరకు అంధుల పాఠశాల కొనసాగింపు



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ నర్సింహ

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలో డ్వాబ్ సంస్థచే నిర్వహించబడుతున్న అంధుల పాఠశాలను ఈ ఏడాది ఏప్రిల్ వరకు కొనసాగించనున్నట్లు డ్వాబ్ సంస్థ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు అధికారులకు తెలియజేశారు. అంధుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సోమవారం నల్లగొండ ఎంఈఓ నర్సింహ, సీడీపీఓ నిర్మల వచ్చి పాఠశాలను పరిశీలించారు. సంక్రాంతి సెలవుల అనంతరం ఈ నెల 18 నుంచి పాఠశాలను ప్రారంభించడం జరిగిందని పాఠశాల నిర్వాహకులు అధికారులకు వివరించారు. ఏప్రిల్ 23వ తేదీ వరకు పాఠశాల నిర్వహిస్తామని, ఈ విద్యా సంవత్సరం పూర్తి అయ్యే వరకు విద్యార్థులకు విద్య అందించడం జరుగుతుందని తెలియజేశారు. బడి మూసివేసినా అంధులకు కంప్యూటర్ శిక్షణ, అంధ వృద్ధుల సమస్యల పరిష్కారం కోసం డ్వాబ్ సంస్థ యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



సాయిసింగ్ (ఫైల్)

చౌటుప్పల్ : మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామ శివారులో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన బొందుల సాయిసింగ్(39) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన కుమారుడు ఆకాష్‌సింగ్‌ను తీసుకొని ఈ నెల 19న దైవ దర్శనం నిమిత్తం తిరుపతికి వెళ్లాడు. దర్శనం అనంతరం 21న ట్రైన్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో నల్లగొండ రైల్వే స్టేషన్‌లో ఆకాష్‌సింగ్ అదృశ్యమయ్యాడు. కుమారుడిని వెతుక్కుంటూ ఆదివారం తూప్రాన్‌పేట గ్రామానికి చేరుకున్న సాయిసింగ్‌ను గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని చౌటుప్పల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందాడు. సోమవారం మృతుడి సోదరి ఠాకూర్ శిరీష ఫిర్యాదు మేరకు ఎస్సై సీత పాండు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా తప్పిపోయిన మృతుడి కుమారుడు ఆకాష్‌సింగ్ ఆదివారం సంస్థాన్ నారాయణపురం పోలీసులకు దొరికాడు. పోలీసులు అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పట్టు పరిశ్రమతో అధిక ఆదాయం



మాట్లాడుతున్న సూర్యాపేట జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి శ్రీధర్

గరిడేపల్లి: పట్టు పరిశ్రమతో ప్రతి నెలా అధిక ఆదాయం పొందవచ్చునని సూర్యాపేట జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి శ్రీధర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో పట్టు రైతులకు నైపుణ్య శిక్షణ తరగతులను కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త బి. లవకుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శ్రీధర్ హాజరై మాట్లాడారు. ప్రత్యామ్నాయ పంటగా మల్బరీ సాగు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. పట్టు ఉత్పత్తి, మార్కెటింగ్ అంశాలపై జిల్లాలో ఎంపిక చేసిన రైతులకు కేవీకే ద్వారా నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రోగ్రాం కోఆర్డినేటర్ లవకుమార్ మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పట్టు పురుగుల పెంపకం చేపట్టిన రైతులతో పాటు సెరికల్చర్‌పై ఆసక్తి గల వారికి ములుగు జిల్లాలోని కేంద్రీయ పట్టు పరిశోధనా కేంద్రం రీజనల్ రీసెర్చ్ సెంటర్ ఆర్థిక సహకారంతో మూడు రోజుల పాటు నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు నరేష్, సుగంధి, నరేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.